ఇదొక ఘోరమైన కథ. క్వార్ట్జ్ రాయిని క్వారీనుండి తవ్వి తీసి పొడిచేసి అమ్ముకుని లాభాలు సంపాదించుకున్న ఒక కంపెనీ ఆ క్రమంలో ఒక దశాబ్దకాలం తన కార్మికుల ఊపిరితిత్తులను దుమ్ము (సిలికా)తో నింపి రోగగ్రస్తులను చేసి ఆ విషయం గ్రహించగానే క్వారీని మూసేసి వెళ్ళిపోగా ఆ తరువాత రోగగ్రస్తులయిన కార్మికులు ఒక్కొక్కరూ- ఇప్పటికి 270 మంది చనిపోయిన కథ ఇది. ఇది జరిగింది ఆఫ్రికాలోనో, దక్షిణ అమెరికాలోనో కాదు. మన దేశంలోనే, మన రాష్ట్రంలోనే. ఆ కంపెనీ విదేశీ బహుళజాతి కంపెనీ కాదు. దేశీయ గుత్త పెట్టుబడిదారీ కంపెనీ కాదు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంలోని ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏ.పి.ఎం.డి.సి).

# షాద్‌నగర్ క్వారీ కార్మికుల మరణాలు

అప్పట్లో దానిని ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ (ఏ.పి.ఎం.సి) అనేవారు. 1965లో ఈ ఏ.పి.ఎం.సి రాష్ట్ర ప్రభుత్వంనుండి రెండు క్వార్ట్జ్ గనులు లీజుకు తీసుకుంది. అవి ఉండేది మహబూబ్‌నగర్ జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం (పాత షాద్‌నగర్ తాలూకా)లోని ఎల్కట్ట, చౌలపల్లి అనే రెండు గ్రామాలలో. ఈ రెండు గ్రామాల మధ్య 5 కి.మీల దూరం ఉంటుంది. ఈ గ్రామాలకు సమీపంలోని గుట్టలలో క్వార్ట్జ్ రాయి దొరుకుతుంది. దానిని తవ్వి తీసి మెత్తగా నలగ్గొట్టి అమ్మడం ఏ.పి.ఎం.సి చేపట్టిన వ్యాపారం.

ఎల్కట్టలోనూ చౌలపల్లిలోనూ గనులుండగా, తవ్వితీసిన రాయిని పొడిచేసే క్రషింగ్ యూనిట్‌ను ఏ.పి.ఎం.సి ఎల్కట్ట క్వారీ సమీపంలో నెలకొల్పింది. చౌలపల్లి కార్ట్జ్ రాయిని కూడా అక్కడికే తీసుకొచ్చి నలగ్గొట్టేవారు.

ఈ వ్యాపారం 1965 నుండి 1974 దాకా నడిచింది. ఏ.పి.ఎం.సి లీజు 1985 దాకా ఉన్నప్పటికీ, క్వార్ట్జ్ రాయి క్వారీలలో ఇంకా పుష్కలంగా ఉన్నప్పటికీ, 1974లో ఏ.పి.ఎం.సి ఆ గనులను మూసేసి వెళ్ళిపోయింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కార్మికులు దాదాపు 400 మంది (మూడు షిఫ్టులలో) ఈ క్వారీలలోనూ క్రషింగ్ యూనిట్‌లోనూ పనిచేసేవారు. వారంతా లంబాడా తండలకు చెందిన గిరిజనులు, ఇతర గ్రామాలకు చెందిన బి.సి, ఎస్.సి కులాల పేద రైతులు. అత్యధిక భాగం నిరక్షరాస్యులు. 1981 జనాభా లెక్కల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లాలో నిరక్షరాస్యత మగవాళ్ళలో 72 శాతం, స్త్రీలలో 90 శాతం ఉండింది. 1965-74 కాలంలో ఇంకా ఎక్కువే ఉండి వుంటుంది. పైగా అది పారిశ్రామిక ప్రాంతం కాదు. కరువు పీడిత వ్యవసాయ ప్రాంతం. ఆ గ్రామాల నుండి వచ్చిన క్వారీ కార్మికులకు తమ హక్కులేమిటో, ప్రభుత్వ అధికార్ల బాధ్యత ఏమిటో, యాజమాన్యం విధులేమిటో తెలీదు. క్వార్ట్జ్ క్వారీలో పనిచేస్తే రాగల రోగాలేమిటో, వాటిని నివారించడానికి యాజమాన్యం చేపట్టవలసిన చర్యలేమిటో తెలీదు. యాజమాన్యం ఆ చర్యలు చేపట్టకపోతే తాము ఎవరికి ఫిర్యాదు చేసుకోవాలో తెలీదు. ఏమీ తెలియని ఈ కూలిజనం శ్రమను ఒక దశాబ్ద కాలం వాడుకుని వాళ్ళ ఊపిరితిత్తులలో విషపు ధూళి నింపి చివరికి కారణం చెప్పకుండా వార్నింగ్ ఇవ్వకుండా అందరినీ ఒక్క రొక్కరుగా రిట్రెంచ్ చేసేసి క్వారీలు మూసేసి వెళ్ళిపోయింది ఏ.పి.ఎం.సి. మూసేసే నాటికే ఒకరిద్దరు కార్మికులు సిలికోసిస్ సంబంధిత శ్వాసకోశ రోగంవల్ల మరణించారు. ఆ తరువాత 24 సంవత్సరాలలో మొత్తం 270 మంది చనిపోయారు. ఇప్పుడు ఇంకొక 30 లేక 35 మంది జబ్బుతో బాధపడుతున్నారు. చనిపోయిన 270 మందిలో 42 శాతం (లంబాడా) గిరిజనులు, 48 శాతం వెనుకబడిన కులాలకు చెందిన వారు, 8 శాతం షెడ్యూల్డు కులాలకు చెందిన వారు.

## సిలికోసిస్ అంటేఏమిటి?

సిలికా (సిలికన్ డయాక్సైడ్) ఊపిరితిత్తులలో పేరుకుని పోవడం వల్ల వచ్చే రోగం సిలికోసిస్. సిలికా ప్రకృతిలో విరివిగా దొరుకుతుంది. మామూలు ఇసుకలో ఎక్కువ భాగం సిలికా ఉంటుంది. క్వార్ట్జ్ రాయిలో అత్యధికంగా సిలికా ఉంటుంది. ఇది సన్నటి దుమ్ము రేణువుల రూపంలో మన ఊపిరితిత్తులలో చేరితే కొంత కాలానికి ఊపిరితిత్తులు తమ మెత్తదనాన్ని కోల్పోతాయి. ఈ స్థితిని ఫైబ్రోసిస్ (Fibrosis) అంటారు. సిలికోసిస్ అనేది ఒక రకమైన ఫైబ్రోసిస్. దాని ఫలితంగా ఏమవుతుందంటే మనం పీల్చుకునే ఊపిరినుండి రక్తంలోకి వెళ్ళి చేరే ప్రాణవాయువు పరిమాణం తగ్గిపోతుంది. ఎగ ఊపిరి, నీరసం, ఆయాసం, సిలికోసిస్‌ను సూచించే ప్రాథమిక రోగ లక్షణాలు. ఇది తీవ్రరూపం తీసుకుంటే శ్వాసకోశ సంబంధమైన ఇన్‌ఫెక్షన్‌లకు దారితీస్తుంది. ఉమ్మిలో రక్తం పడుతుంది. పనిచేయలేక, నడవలేక రోగి నీరసించి పోవడం జరుగుతుంది.

ఊపిరితిత్తులలో దుమ్ము చేరితే, క్షయవ్యాధి క్రిములను ప్రతిఘటించవలసిన శరీరకణాలు ఈ దుమ్ముతో సంఘర్షించి నీరసపడిపోతాయి. అప్పుడు క్షయరోగం సులభంగా వస్తుంది. క్షయను వ్యతిరేకించే శరీర రక్షణ వ్యవస్థను నీరసింప చేయడంద్వారా క్షయవ్యాధికి తావు కల్పించే వ్యాధులను 'న్యూమోకోనియోసిస్' (Pneumoconioses) అంటారు. సిలికోసిస్ ఒక రకమైన న్యూమోకోనియోసిస్. ఆస్బెస్టాస్ ధూళి ఊపిరితిత్తులలో పేరుకుని పోవడంవల్ల వచ్చే ఆస్బెస్టాసిస్ రోగం కూడా మరొక న్యూమోకోనియోసిస్. ఆస్బెస్టాస్ గనులలో పనిచేసే కార్మికులకు కూడ ఆస్బెస్టాసిస్ రోగం, తత్ఫలితంగా క్షయరోగం వస్తుంటాయి. అయితే, న్యూమోకోనియోసిస్ లన్నిటిలోనికీ అతి ఎక్కువగా క్షయకు దారితీసేది సిలికోసిస్ అని వైద్య నిపుణులు అంటారు.

సిలికోసిస్‌తో సహా అన్ని న్యూమోకోనియోసిస్‌లకూ (అంటే ఊపిరితిత్తులలో దుమ్ము చేరడంవల్ల వచ్చే అన్ని ఫైబ్రోసిస్ రోగాలకూ) ఒక సామాన్య లక్షణం ఉందని కూడా నిపుణులు అంటారు. అదేమిటంటే, ధూళి పీల్చుకున్న దశకూ రోగం పొడసూపే దశకూ మధ్య కాలవ్యవధి చాలా ఉండవచ్చు. అంటే ఉదాహరణకు క్వార్ట్జ్ (సిలికా) గనులలోగానీ

ఆస్బెస్టాస్ గనులలోగానీ అయిదు సంవత్సరాలు పనిచేసిన వ్యక్తిలో ఆ అయిదేళ్ళలో రోగలక్షణాలేవీ కనిపించకపోవచ్చు. ఆ తరువాత అతను ఆ పని మానేసినా, ఆ అయిదు సంవత్సరాలలో ఊపిరితిత్తులలో పేరుకున్న దుమ్ము చాలా సంవత్సరాల పిదప రోగం రూపం తీసుకుని క్షయగా మారవచ్చు లేదా ఇతర రూపాలలో ప్రాణాంతకం కావచ్చు. ఎల్కట్ట, చౌలపల్లి కార్మికులకు ఇదే జరిగింది. వాళ్ళు పనిచేసింది 1965-74 కాలంలో. వాళ్ళలో సిలికోసిస్ రోగ లక్షణాలు కనిపించడం మొదలయింది 1973లో. అది గ్రహించిన యాజమాన్యం 1974లో ఆదరాబాదరాగా కారణం చెప్పకుండా కార్మికులొక్కొక్కరినీ రిట్రెంచ్ చేసి గనులు మూసేసింది. వారి ఊపిరితిత్తులలో మృత్యుదేవత దాగివుందని యాజమాన్యం కార్మికులకు చెప్పలేదు. వాళ్ళు ఆ తరువాత ఒక్కొక్కరుగా చావడం మొదలు పెట్టారు. ఈ సంవత్సరం దాకా చస్తూనే ఉన్నారు. ఆ గనులలో పనిచేసినవారు ఎల్కట్ట, చౌలపల్లి, రంగంపల్లి, మొగిలిగిద్ద, చించోడ్, పీర్లగుడా, కంసానిపల్లి, విట్యాల్, కిసాన్‌నగర్ గ్రామాలకూ దొంతికుంట తండ, మేలబావితండ, గుట్టెనక తండ, కర్ణమోనికుంట, నాగర్లగడ్డ, పులిచెర్లకుంట, ఇస్లావత్ తండ మొదలయిన లంబాడా తండాలకు చెందిన వారు. చనిపోయిన 270 మంది ఈ క్రింది గ్రామాలకు చెందిన వారు:

| మృతుల వివరాలు | |
|---|---|
| చౌలపల్లి (తండాలు కలుపుకుని) | 53 |
| ఎల్కట్ట (తండాలు కలుపుకుని) | 52 |
| రంగంపల్లి | 42 |
| కంసానిపల్లి (తండాలు కలుపుకుని) | 39 |
| విట్యాల్ (తండాలు కలుపుకుని) | 30 |
| పీర్లగుడా | 28 |
| చించోడ్ | 11 |
| కిసాన్‌నగర్ (తండాలు కలుపుకుని) | 10 |
| మొగిలిగిద్ద | 5 |
| మొత్తం | 270 |

## అసలు ఏం జరిగింది?

చౌలపల్లి, ఎల్కట్ట గనులలో క్వార్ట్జ్ రాయి తవ్వకం జరిగేది. డైనమైట్లు పెట్టి రాయిని పేల్చి క్వార్ట్జ్ బండలు, లేక రాళ్ళు సేకరించేవారు. ఇక్కడ కొంత ధూళి రేగినప్పటికీ మరీ తీవ్ర పరిమాణంలో ఉండేది కాదు. అయితే ఈ రాళ్ళనూ బండలనూ సన్నటి పొడిగా నలగ్గొట్టనిదే పని పూర్తయినట్టుకాదు. అప్పుడే అది అమ్మకానికి పనికొస్తుంది. దానికోసం ఎల్కట్ట క్వారీ పక్కనే ఒక క్రషింగ్ యూనిట్ నిర్మించారు. ఇది దీర్ఘచతురస్రాకారంలో ఉన్న షెడ్డు. దీని వెలుపల ఒక బట్టీ వుండేది. క్వారీల నుండి సేకరించిన క్వార్ట్జ్ రాళ్ళను ఈ బట్టీలో 1000 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు వేడి చేసేవారు. ఆ వేడి రాయిని క్రషింగ్ యూనిట్‌లోకి కార్మికులు తీసుకుపోయేవారు. అక్కడ జా-క్రషర్ (Jaw-crusher) అనే యంత్రం ఆ క్వార్ట్జ్ రాళ్ళను చిన్న ముక్కలుగా విరగ్గొట్టేది. ఆ తరువాత వాటిని మెత్తగా పొడిగొట్టే పని జరిగేది. ఇది కొంత భాగం ఎడ్జ్‌రన్నర్ (Edge-runner) అనే యంత్రం ద్వారా జరిగితే కొంత భాగం శారీరకంగా జరిగేది. స్త్రీ కార్మికులు సుత్తితో క్వార్ట్జ్ ముక్కలను మెత్తగా నలగ్గొట్టేవారు. ఆ తరువాత నలగ్గొట్టబడిన ఆ క్వార్ట్జ్‌ను జల్లెడ పట్టి దానికి తుది రూపం ఇచ్చేవారు. జల్లెడ పట్టగా వచ్చిన పొడిని ప్యాక్‌చేసి బయటకు సరఫరా చేసేవారు.

కొంత భాగం యంత్రాలద్వారా, కొంతభాగం శారీరకంగా జరిగిన ఈ పని కోసం క్రషింగ్ యూనిట్‌లో ఎప్పుడయినా 80 లేక 90 మంది కార్మికులు ఉండేవారు. అదే కార్మికులే వంతుల వారీగా క్వారీలలోనూ క్రషింగ్ యూనిట్‌లోనూ పనిచేసేవారు. క్వారీలో (అంటే గనిలో) పనిచేసినప్పటికంటే క్రషింగ్ యూనిట్‌లో పనిచేసినప్పుడే సిలికా ధూళి విపరీతంగా వాళ్ళను ఆవరించి ఉండేది. ముఖ్యంగా, ఎడ్జ్-రన్నర్ దగ్గర పనిచేసిన వారు, జల్లెడ పట్టినవారు ఎక్కువగా సిలికా ధూళి పీల్చి ఉంటారు.

ఈ రకమైన పరిస్థితులలో పనిచేస్తే అది సిలికోసిస్ వంటి శ్వాసకోశ సంబంధమైన వ్యాధులకు దారి తీయగలదనీ, సిలికోసిస్ ప్రాణాంతకమైన వ్యాధి అనీ ఆ కార్మికులకు తెలీదు. కానీ యాజమాన్యానికి తెలుసు. తెలిసినా యాజమాన్యం కార్మికులకు ఏమీ చెప్పలేదు. ధూళినుండి వాళ్ళను కాపాడడానికి తగిన చర్యలేవీ తీసుకోలేదు. అప్పుడప్పుడు ముఖానికి తొడుగుల వంటివి ఇచ్చేవారంటగానీ అవి ఎంతమాత్రం సరిపోవు. నిజానికి క్రషింగ్ యూనిట్‌ను పూర్తిగా యంత్రీకరించడం తప్ప దీనికి నివారణోపాయమేదీ లేకపోవచ్చు. ఏదైనా ఉన్నా దానిని అన్వేషించే ప్రయత్నం ఎ.పి.ఎం.సి చేయలేదు. తెలిసీ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంది. వాళ్ళకు కనీసం విషయ పరిజ్ఞానం కల్గిస్తే వాళ్ళ జాగ్రత్తలు వాళ్ళు తీసుకుందురేమో. ఆ పని కూడా చేయలేదు. కార్మికులకు ధూళిలో పనిచేయడం కొంత ఇబ్బందిగానే తోచినా, కరువు ప్రాంతంలో ఈ మాత్రం పని కూడా సులభంగా దొరకదు కాబట్టి ఇబ్బందిని భరించి పని చేశారు.

1973లో చౌలపల్లికి చెందిన అన్నారపు వెంకయ్య అనే క్వారీ కార్మికుడు సిలికోసిస్ జబ్బుతో చనిపోయాడు. ఆ తరువాత మరొక నలుగురు కార్మికులు (జంగం రామయ్య, జల్ల పాపయ్య, గుంటి బాలయ్య, బోడ లింగయ్య) జబ్బు పడ్డారు. యాజమాన్యమే వారిని వైద్యంకోసం హైదరాబాద్ తీసుకుపోయింది.

దీని భావమేమిటో కార్మికులకు అర్థం కాలేదుగానీ యాజమాన్యానికి అర్థం అయింది. చాలామంది కార్మికుల ఊపిరితిత్తులలో చావు పొంచివుందని యాజమాన్యం గ్రహించింది. విషయం బయటకు పొక్కే లోపల క్వారీలు మూసేసి వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంది. అయితే పారిశ్రామిక వివాదాల చట్టం (ఐ.డి.చట్టం) సెక్షన్ 25-O ప్రకారం మూసివేతకు ప్రభుత్వం అనుమతి పొందవలసి వుంటుంది. మూసివేతకు గల కారణమేమిటో ప్రభుత్వానికి తెలియజేస్తూ మూడు నెలలు ముందే అర్జీ పెట్టుకోవలసి వుంటుంది. ప్రభుత్వం మూసివేత సహేతుకమా కాదా అని విచారించి అనుమతి ఇయ్యవచ్చు లేదా నిరాకరించవచ్చు. ఆ విచారణలో ప్రభుత్వం యాజమాన్యం చెప్పే వాదననే కాక కార్మికుల అభిప్రాయాలనూ ఆ కంపెనీ మూసివేత విషయంలో ఆసక్తిగల ఇతర వ్యక్తుల అభిప్రాయాలనూ కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఐడి చట్టంలోని ఈ సాధారణ నియమమేగాక, గనులకు (చట్టం పరిభాషలో క్వారీలు కూడా గనులే) వర్తించే ప్రత్యేక నియమం కూడా ఒకటి ఉంది. మెటలిఫెరస్

మైన్స్ రెగ్యులేషన్స్ (1961)లోని సెక్షన్ 6 ఏమంటుందంటే గనిని మూసివేయదలచుకున్న యాజమాన్యం చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్‌కు నెల రోజుల నోటీస్ ఇవ్వాలని.

కానీ ఈ పద్ధతిలో గనక ఎ.పి.ఎం.సి తన క్వారీలను మూసివేసి ఉంటే ప్రభుత్వ విచారణలో గానీ మైన్స్ అధికారుల విచారణలోగానీ అసలు విషయం బయటకు వచ్చి వుండేది. చనిపోయిన కార్మికులకే కాక రోగగ్రస్తులయిన వారికి కూడా ఏదో ఒక మేరకు నష్టపరిహారం చెల్లించుకోక తప్పని పరిస్థితి ఎ.పి.ఎం.సికి ఏర్పడేది. దీనిని తప్పించుకోవడానికి ఆ సంస్థ ఏం చేసిందంటే కంపెనీని ఒక్కసారిగా మూసివేయకుండా కార్మికులను గుంపులు గుంపులుగా రిట్రెంచ్ చేసి చివరికి ఉత్పత్తి మొత్తం ఆపివేసి మూసివేసినట్టు ప్రకటించకుండా మూసివేసింది. రిట్రెంచ్‌మెంట్‌కు కూడా ఐడి చట్టం సెక్షన్ 25-ఎ ప్రకారం ప్రభుత్వానికి నోటీసు ఇచ్చి అనుమతి పొందవలసి వుంటుంది. అయితే ఈ అనుమతి కొంత రొటీన్‌గా దొరుకుతుంది. ఎ.పి.ఎం.సి రొటీన్‌గానే పొందింది. నిజానికి వరుసబెట్టి కార్మికులందరినీ ఎ.పి.ఎం.సి రిట్రెంచ్ చేపివేస్తుంటే రీజనల్ లేబర్ కమిషనర్‌కు అనుమానం వచ్చి ఉండాలి. రిట్రెంచ్‌మెంట్ పేరిట కంపెనీని మూసివేయడం జరుగుతున్నదేమోనన్న సందేహం వచ్చి ఉండాలి. కానీ ఇబ్బందికరమైన సందేహాలు రాకుండా చూసుకోవడంలో మన ప్రభుత్వ సంక్షేమ శాఖల అధికారులు దిట్టలు. కాబట్టి ఎ.పి.ఎం.సి నుండి నోటీస్ పొందిన రీజనల్ లేబర్ కమిషనర్ అనుమతి సులభంగానే ఇచ్చేసాడు.

ఆ విధంగా 1974 చివరినాటికి ఎ.పి.ఎం.సి ఏ కష్టం లేకుండా ఎల్కట్ట, చౌలపల్లి గనుల 'భారాన్ని' వదిలించుకుంది. దీనివల్ల జరిగిన ఘోరమైన నష్టమేమిటంటే తాము తీవ్రంగా రోగగ్రస్తులమై ఉన్నామని - లేదా రోగాన్ని బీజ రూపంలో తమ ఊపిరితిత్తులలో దాచుకుని ఉన్నామని కార్మికులకు తెలియలేదు. తెలిసి వుంటే ప్రభుత్వం ఏమీ చేయకున్నా ఎ.పి.ఎం.సి ఏమీ చేయకున్నా కార్మికులే ఏమైనా చేసుకుందురేమో. దగ్గు, ఆయాసం రాగానే అది ముదిరి ప్రాణం తీసేలోపల ఉన్న కొంచెం ఆస్తి తాకట్టుపెట్టి వైద్యం చేయించుకుందురో, ఏ స్వచ్ఛంద సంస్థనో ఆశ్రయిద్దురో లేకపోతే కోర్టుకే పోదురో. దానికి కావలసిన కనీసం పరిజ్ఞానం వాళ్ళకు లేకుండా చేసిన ఎ.పి.ఎం.సిని ఏమనాలి?

## ప్రభుత్వ అధికారుల బాధ్యతా రాహిత్యం

తప్పు ఒక్క ఎ.పి.ఎం.సిదే కాదు. గనులపైన పర్యవేక్షణ జరిపే యంత్రాంగమొకటి ఉంది. గనుల భద్రతకు సంబంధించిన నియమాలున్నాయి. అవి అమలవుతున్నాయో లేదో చూసే అధికారం ఈ పర్యవేక్షక యంత్రాంగానికి ఉంది. 'గనుల భద్రత'లో గనులు కూలిపోవడం, గనులలో అగ్ని ప్రమాదాలు జరగడం వంటి విపత్తులకే చట్టం తొలినాడు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చింది. గనులలో పనిచేసే కార్మికులు ఎదుర్కొనే వృత్తి సంబంధమైన ఆపదలలో (Ocupational hazards) దుమ్ము ధూళి తదితర అపరిశుభ్ర పరిసరాల ప్రభావంవల్ల వచ్చే రోగాలకు మొదట్లో ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వలేదు. (మెటలిఫెరస్ మైన్స్ రెగ్యులేషన్స్‌ను 1988లో సవరించి సెక్షన్ 124ను చేర్చడం ద్వారా ప్రస్తుతం చట్టం ఈ లోపాన్ని అధిగమించింది). అయినప్పటికీ దుమ్ము ధూళి వల్ల కలుగగల ప్రమాదాలనుండి గని కార్మికులకు యాజమాన్యం తగు రక్షణ కల్పించేటట్టు చూసే అధికారం సంబంధిత ప్రభుత్వ అధికారులకు మైన్స్ చట్టం (1952)లోనూ, మెటలిఫెరస్ మైన్స్ రెగ్యులేషన్ (1961)లోనూ మొదటినుండీ ఉంది. గనుల ప్రధాన పర్యవేక్షక అధికారిని గనుల చట్టం చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ అంటుంది. ఇతను దేశంలోని అత్యున్నత పర్యవేక్షక అధికారి. కేంద్రప్రభుత్వం బీహార్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో డైరెక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అనే సంస్థను నెలకొల్పి దాని డైరెక్టర్నే దేశమంతటికీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ అని ప్రకటించింది. ప్రతి రాష్ట్రంలోనూ ఒక డిప్యూటీ డైరెక్టరు తదితర కిందిస్థాయి అధికారులు ఉంటారు. గనుల చట్టం ఈ పర్యవేక్షక అధికారులకు చాలా అధికారం ఇచ్చింది. గనుల నిర్వహణ సక్రమంగా జరుగుతుందా లేదా చూడడానికి (కార్మికుల పని పరిస్థితులు ఆరోగ్యకరంగా ఉన్నాయా లేదా అనేది కూడా అందులో భాగమేనని మైన్స్ చట్టంలోని సెక్షన్ 7 స్పష్టం చేస్తుంది) చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్‌గానీ అతని ఉప అధికారులుగానీ ఏ గనిలోకయినా ఎప్పుడయినా పోవచ్చును. సంబంధిత రికార్డులు స్వాధీనం చేసుకోవచ్చును. కార్మికులనూ ఇతర సిబ్బందినీ విచారించి వాళ్ళ వాంగ్మూలాలు తీసుకోవచ్చును.

ఇది కేవలం ఆ ఇన్‌స్పెక్టర్ల అధికారం మాత్రమే కాదు. వాళ్ళ బాధ్యత, వాళ్ళ విధి. కానీ ఎల్కట్ట, చౌలపల్లి గనులు ఉనికిలో ఉన్న పది సంవత్సరాల కాలంలో గనుల చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గానీ అతని కిందిస్థాయి అధికారులుగానీ ఒక్కసారికూడా అటువైపు రాలేదు. ఎటువంటి విచారణలూ జరపలేదు. మైన్స్ చట్టం సెక్షన్ 25 ఏమంటుందంటే గనిలో పనిచేసే కార్మికులెవరికయినా వృత్తిసంబంధమైన రోగం వచ్చినట్టయితే యాజమాన్యం ఆ విషయాన్ని వెంటనే చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్‌కు తెలియజేయాలని. కానీ అన్నారపు వెంకయ్య చనిపోయినప్పుడుగానీ, జంగం రామయ్య తదితరులను తానే హైదరాబాద్ తీసుకుపోయి వైద్యం చేయించినప్పుడుగానీ వారి రోగాలు క్వారీలో చేసిన పనివల్ల వచ్చినవని తెలిసికూడా యాజమాన్యం చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్‌కు తెలియజేయలేదు. అదే చట్టంలోని సెక్షన్ 72-సి ప్రకారం ఈ విధంగా తెలియజేయకపోవడం ఒక నేరం. దానికి కేసు పెట్టవలసింది, ప్రాసిక్యూట్ చేయవలసింది ఆ చీఫ్ ఇన్‌స్పెక్టరేనని సెక్షన్ 75 అంటుంది. ఇప్పుడు కనీసం ఏడు సంవత్సరాలుగా ఈ విషయాలన్నీ బయటకువచ్చి ఉన్నాయి. చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) దృష్టికొచ్చి అయిదేళ్ళు దాటింది. అయినా మైన్స్ చట్టం సెక్షన్ 75 ప్రకారం ఆయనగారు చేయవలసిన పని చేయలేదు. అంటే ఎ.పి.ఎం.డి.సిపైన కేసు పెట్టలేదు, ప్రాసిక్యూట్ చేయలేదు.

గనులు మూసివేసి ఎ.పి.ఎం.డి.సి బయటపడిన తరువాత వాటిలో పనిచేసిన కార్మికులంతా తమ పూర్వ వృత్తి అయిన వ్యవసాయ కూలి లేదా రోడ్డుపని, బావిపని చేసుకుని బ్రతకసాగారు. చాలా మందికి త్వరలో దగ్గు, ఆయాసం, ఉమ్మిలో రక్తం పడడం మొదలయ్యాయి. తాము క్వారీలో ధూళిలో పనిచేయడానికీ ఈ రోగాలకూ సంబంధం ఉందని వాళ్ళు ఊహించగలిగారు. కానీ అది ఎంత సన్నిహిత సంబంధమో వారికి తెలియదు. ఈ దగ్గు ఈ ఆయాసం క్షయవంటి ప్రాణాంతకమైన వ్యాధులకు దారితీయగలదని తెలీదు. ఈ విషయంలో తమ హక్కులేమిటో, తమ మాజీ యజమానుల బాధ్యత ఏమిటో తెలీదు. ఆ యజమానులూ

(తరువాయి 14వ పేజీలో)

వ్యవహరిస్తుందీ తీర్పు.

- స్త్రీలను వారి యిష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా వైద్య పరీక్షలకు గురిచేయటం వారి హక్కులకు భంగకరమే కాకుండా, వ్యాధిగ్రస్తులు వారి శరీరాల గురించి సరైన అవగాహనకు రాకుండా తయారు చేస్తుంది.

- సెక్సు వ్యాపారంలో ఉన్న స్త్రీలు ఎయిడ్స్ వ్యాధికి సంబంధించినంతవరకు హైరిస్కు గ్రూప్‌కి చెందుతారు. అయితే ఎయిడ్స్ నివారణ కోసం ప్రచారం నిమిత్తం కోట్లు ఖర్చుచేసే ప్రభుత్వం వీరికి రోగాలు సోకకుండా నివారించే విషయంలో పూర్తిగా విఫలమౌతోందన్నది నిర్వివాదం. స్వచ్ఛంద సేవాసంస్థలద్వారా అక్కడక్కడా మొక్కుబడిగా పంపిణీ చేసే 'నిరోధ్'లు తరుచూ వాడకంలో పగిలిపోతుంటాయని ఆరోపణలున్నాయి.

- ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వేరుగా చూడటం తగదని, వారి విషయంలో చాలా సున్నితంగా వ్యవహరించాలని ప్రభుత్వం పాలసీ. ఆచరణలో మాత్రం వారిని ఎన్ని ఇబ్బందులకు గురిచెయ్యవచ్చునో అంతా ఈ సందర్భంలో జరిగింది.

- ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) చట్టంలో చెర విడిపించబడిన స్త్రీలను తిరిగి వృత్తిలోకి దిగలాగే పరిస్థితులనుండి రక్షించటానికి రక్షణ గృహాలలో ఉంచవచ్చని ఉంది. ఏ చట్టంలోనూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో వేరుగా వ్యవహరించాలని లేదు. హైకోర్టు తీర్పు వలన ఇందుకు పూర్తి భిన్నంగా జరుగుతోంది. రక్షణ గృహాల మాట అటుంచి మెహందీ స్త్రీలను గత ఏడు నెలలుగా జైల్లో బంధించి ఉంచారు. మిగతావారిని వదిలివేసి, ఎయిడ్స్ సోకిందేమోనన్న అనుమానం ఉన్నవారిని మాత్రం రక్షణ గృహానికి తరలించాలన్న తీర్పు సమర్థనీయం కాకపోగా, ఆ స్త్రీలకు వ్యాధిగురించి ఎటువంటి అవగాహన కల్పించే ప్రయత్నమే జరగలేదు. వైద్యం సంగతి సరేసరి.

ఆగస్టు 22న హైకోర్టు ఇచ్చిన తీర్పు వలన ఎవరు లాభపడ్డారు అన్నది వదిలేస్తే నష్టపోయిన స్త్రీల పరిస్థితి మాత్రం దారుణంగా మారింది. మెహందీలో వ్యాపారం పూర్తిగా మూతపడటమే కాక, ఇళ్ళ స్వంతదారులు తిరిగి సేటాణీలకు ఇళ్ళు అద్దెకివ్వకుండా తీవ్రమైన వత్తిడికి గురౌతున్నారు. స్వంత ఇళ్ళున్న సేటాణీలు కూడా వాటిలోకి ప్రవేశించలేక రోడ్డున బతుకుతున్నారు. చేతనైన కొద్దిమంది నగరంలో ఇతర ప్రాంతాలలో తిరిగి వ్యాపారం మొదలు పెట్టగా చాలామంది స్త్రీలు స్వంతంగా రోడ్లమీద వ్యాపారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మెహందీలో ఉండే కొద్దిపాటి రక్షణ కూడా లేక వీరు తరుచూ గూండాల దాడులకు గురౌతున్నారు.

- గుడివాడకు చెందిన రాధ అనే ఒక అమ్మాయి ఇలాగే మెహందీ మూతపడిన తర్వాత రోడ్డు మీద వ్యాపారం మొదలుపెట్టి గూండాల చేత చిక్కి అమానుషంగా బలాత్కరించబడి హత్య చేయబడింది. ఈ సంఘటన జూన్ నెలలో జరిగింది.

- నదీమా అనే ఇద్దరు పిల్లల తల్లి, ఆకలి, చలి, ఎండా, వానల మూలంగా జబ్బుపడి, ఆగస్టు 22న హైకోర్టుకి అతి దగ్గరలో మరణించింది.

- మున్నీ అనే మరొక స్త్రీ సెప్టెంబర్ 4న ఉస్మానియా ఆసుపత్రిలో మరణించింది.

-లత అనే మరో స్త్రీ జైల్లో జబ్బుపడి మరణించింది.

ప్రకారం పిల్లలున్న హెచ్.ఐ.వి పాజిటివ్ స్త్రీలను హోంకి తరలిస్తే, వారి పిల్లలను ప్రభుత్వ హాస్టళ్ళలో చేర్పి చదువు చెప్పించాలని తీర్పులో ఉన్నా అటువంటి ప్రయత్నాలేవీ ఇంతవరకు జరిగిన దాఖలాలు లేవు. ఈ స్త్రీల సంపాదన మీద ఆధారపడివున్న కుటుంబ సభ్యులు వీళ్ళు జైలునుంచి ఎప్పటికైనా బయటపడతారన్న ఆశతో కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకేదో జబ్బుందన్నది ఉత్తిమాట అని నమ్ముతున్న స్త్రీలు 'హోం'లోకి తరలే ప్రసక్తి లేదంటున్నారు. జైలునుంచి విడుదలైతే చాలు, తమ స్వగ్రామాలకి వెళ్ళిపోయి కుటుంబాలతో కలిసి ఉండాలనుకుంటున్నామని చెప్తున్నారు.

- అనంతకృష్ణ

## షాద్‌నగర్ క్వారీ కార్మికుల మరణాలు

(11వ పేజీ తరువాయి)

ప్రభుత్వ అధికారులూ వారికివన్నీ తెలియకుండా చేశారు.

క్రమంగా క్వారీ కార్మికులుగా పనిచేసిన వారు ఒక్కొక్కరుగా మరణించసాగారు. కొంచెం పొలము, పశువులు ఉన్నవాళ్ళు వాటిని అమ్ముకుని వైద్యం చేయించుకున్నారు. కొంతమంది హైదరాబాద్ దాకా వచ్చారు. కొందరు రంగారెడ్డి జిల్లా అనంతగిరిలోని టి.బి సానిటోరియంలో వైద్యం చేయించుకున్నారు. నిపుణుల చేత పరీక్ష చేయించుకున్న కొద్దిమంది డయగ్నాస్టిక్ రిపోర్టులో 'టి.బి' అన్న పొడి అక్షరాలు ఉన్నాయి.

ఇప్పటికి 270 మంది చనిపోయారు. ఇంకొక 30 లేక 35 మంది రోగగ్రస్తులయి వున్నారు. 1990 దాకా నిశ్శబ్దంగా సాగిన ఈ చావు కథ ఆ సంవత్సరం బయటికొచ్చింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాంబశివరావు అనే స్వచ్ఛంద సంస్థ కార్యకర్త ఈ విషయాలు కాకతాళీయంగా తెలుసుకున్నాడు. ఊరూరా తిరిగి తాను విన్నది నిజమేనని నిర్ధారించుకున్నాడు. పత్రికలవారికి చెప్పి వార్తా కథనాలు రాయించాడు. ప్రతిపక్ష ఎం.ఎల్.ఎలకు చెప్పి అసెంబ్లీలో ప్రశ్నలు వేయించాడు. రాష్ట్రపతికీ, ప్రధానమంత్రికీ, గవర్నర్‌కూ, ముఖ్యమంత్రికీ అర్జీలు పెట్టుకున్నాడు. ప్రస్తుతం హైకోర్టులో కేసువేసే ప్రయత్నంలో ఉన్నాడు.

అతని దగ్గిర సమాచారం తీసుకున్న ఢిల్లీకి చెందిన పి.ఆర్.ఐ.ఎ అనే మరొక స్వచ్ఛంద సంస్థ 1997లో ఈ విషయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ, ధన్‌బాద్‌గారికి (వీరే ఈ దేశానికి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ అని పైన చెప్పాము) తెలియజేసి విచారణ జరిపించమని కోరింది. ఆయన హైదరాబాద్‌లో ఉండే డిప్యూటీ డైరెక్టర్‌ను హుటాహుటిన పంపించి ఎ.పి.ఎం.డి.సి వద్దనున్న సంబంధిత రికార్డులన్నీ స్వాధీనం చేసుకుని విచారణ మొదలు పెట్టించారు. ఆ విచారణ ఎంత వేగంగా మొదలయిందో అంత వేగంగా చల్లారిపోయింది. ఇప్పటికీ దాని రిపోర్టు వెలువడలేదు. మధ్యలో అసెంబ్లీలో ప్రతిపక్షాల చేత అడిగించిన ప్రశ్నల ఫలితంగా రాష్ట్రప్రభుత్వం కొంచెం కదిలి ఆ గ్రామాలకు వైద్యులను పంపిస్తూ ఉంది. అయితే ఇదయినా ఇంకా బ్రతికి ఉన్నవాళ్ళకు వైద్యం చేయడానికా, లేక ఎవరికీ సిలికోసిస్ లేదని ఇక్కడ ఏదో జరిగిపోయిందంటూ జరుగుతున్న ప్రచారం అంతా అబద్ధమని బుకాయించడానికా అని స్థానికులు సందేహిస్తున్నారు.భారతదేశ పారిశ్రామిక చరిత్రలో పెద్ద ప్రమాదాలు అనేకం జరిగాయి, జరుగుతున్నాయి. కానీ ఒకే కంపెనీలో పనిచేసిన కార్మికులు కాలుష్య సంబంధమైన రోగంతో ఇంత పెద్ద సంఖ్యలో వేరే ఎక్కడయినా చనిపోయారా? లేదనే అనుకుంటాము. అయినప్పటికీ ఇంతటి ఘోరం ఎంత నిశ్శబ్దంగా, ఎంత మౌనంగా జరిగిపోయింది!